ప్రజాశక్తి
ఆదివారం 31 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



'ప్రజాశక్తి' డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం : ప్రజాశక్తి దినపత్రిక 2024 డైరీ, కేలండర్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తన ఛాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ప్రజాశక్తి కేలండర్ ప్రత్యేకతను శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. కోవిడ్ కొత్త వేరియంట్ నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఎడిటిబ్ జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, పి.వాసు పాల్గొన్నారు.



ప్రజాశక్తి డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కదంతొక్కిన అంగన్వాడీలు

- మంత్రుల ఇళ్లు ముట్టడి
- పలాసలో మంత్రి గేటును తోసుకెళ్లిన వైనం
- 3న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి- పలాస, శ్రీకాకుళం అర్బన్

తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు మంత్రుల కార్యాలయాలను ముట్టడి చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెద్దపాడులోని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పలాస మంత్రి కార్యాలయాలను ముట్టడించారు. దీంతో పలాస వద్ద ఉద్రిక్తత దారితీసింది. మంత్రి అప్పలరాజు కార్యాలయం గేట్లు బద్దలు కొట్టి పోలీసులను పక్కకు నెట్టి బారికేడ్లను తొక్కి ఇంటి వద్దకు అంగన్వాడీ కార్యకర్తలు చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంటి నుంచి బయటకు వచ్చిన మంత్రి సీదిరి అప్పలరాజును అంగన్వాడీ కార్యకర్తలు చుట్టుముట్టారు.

మంత్రి అప్పలరాజు ఎదురుగా నినాదాలు

మంత్రి సీదిరి అప్పలరాజుకు అంగన్వాడీ కార్యకర్తల ధర్నాలో చేదు అనుభవం ఎదురైంది. అంగన్వాడీ సమస్యలపై ధర్నా చేస్తూ సిఐటియు జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో మంత్రి స్పందించి అంగన్వాడీ సమస్యలపై మాట్లాడకుండా సిఐటియు జిందాబాద్ అనడం బాగులేదని, సిఐటియు పేరు ఎందుకు ఎత్తుతున్నారని అన్నారు. దీంతో సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎస్.లక్ష్మినారాయణ, ఎస్.గణపతితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు ఒక్కసారిగా మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. సిఐటియు లేకపోతే మా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని మంత్రిని ప్రశ్నించారు.

కాశీబుగ్గ మంత్రి సీదిరి డాక్టర్ అప్పలరాజు కార్యాలయం ముట్టడి విజయవంతమైంది. ముందుగా మంత్రి కార్యాలయం వద్దకు కాశీబుగ్గ, టెక్కలి, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస ఐసిడిఎస్ ప్రాజెక్టుల నుంచి భారీగా అంగన్వాడీ కార్యకర్తలు చేరుకుని మంత్రి కార్యాలయం గేట్ వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మంత్రి కార్యాలయం లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు గంట పాటు కార్యాలయం ధర్నా చేస్తూ ఒక్కసారిగా అంగన్వాడీ కార్యకర్తలు గేటు తలుపులు బద్దలు కొట్టి కార్యాలయంలోకి చొరబడ్డారు. దీంతో వారితో పాటు పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బారికేడ్లను తొక్కి దూసుకుపోయారు. దీంతో కాశీబుగ్గ సిఐ నవీన్‌కుమార్, కాశీబుగ్గ రూరల్ సిఐ శంకరరావుతో పాటు మంత్రి సెక్యూరిటీ, గన్‌మెన్లు నియంత్రించారు. చివరకు మంత్రి సీదిరి అప్పలరాజు అంగన్వాడీ కార్యకర్తలు వద్దకు వచ్చేసరికి అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని చుట్టుముట్టారు. దీంతో మరింత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుదర్శనం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి అంగన్వాడీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుదర్శనం, జిల్లా కార్యదర్శి బి.హైమావతి, జిల్లా కోశాధికారి ఎన్.హైమావతి, కమిటీ సభ్యులు వి.హేమలత, బి.ఆదిలక్ష్మి, పలాస ప్రాజెక్టు అధ్యక్షులు కె.జ్యోతి, టెక్కలి ప్రాజెక్టు అధ్యక్షులు వాణి, శ్రీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎస్.గణపతి, బమ్మిడి ఆనందరావు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎఐటియుసి నాయకులు చాపర వేణుగోపాల్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల పాట్లు

అంగన్వాడీ కార్యకర్తల పాట్లు అన్నీ ఇన్నీ కావు. తమ సమస్యలు పరిష్కరించాలని 19 రోజులుగా ధర్నా చేయడమే కాకుండా యూనియన్ ఇచ్చిన పిలుపుతో రోడ్లు ఎక్కి రాస్తారోకోలు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, ధర్నాలు, మంత్రి కార్యాలయాలు ముట్టడి చేసే సమయంలో తమతో పాటు మధ్యాహ్న భోజనం తీసుకు వచ్చి రోడ్లపై తినే పరిస్థితి దాపురించింది. అయినా పాలకులకు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం.

బంగారం వస్తువులు మాయం

పలాసలో మంత్రి సీదిరి ఇలాకాలో అంగన్వాడీలు చేపట్టిన మంత్రి కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా గేట్లు తోసి పరుగులు పెట్టిన తరుణంలో నా చెవులకు ఉన్న బంగారం వస్తువులు పడిపోయాయనిఅంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.హైమావతి ఆవేదన వ్యక్తం చేసింది. అయినా బాధపడేది లేదని, తమ సమస్యల పరిష్కారానికి ఎంత వరకైనా వెళ్తానని అన్నారు.



పలాస : అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు సమీపాన గల పేపరు మిల్లు సైట్‌లో ఉన్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. వందల సంఖ్యలో అంగన్వాడీలు అక్కడికి చేరుకుని ఆయన ఇంటికి వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంత్రి ధర్మాన ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ఆయన వచ్చేంత వరకు రోడ్డుపైనే ఆందోళన చేపట్టారు.

సిఎం దృష్టికి తీసుకెళ్తా : ధర్మాన

అంగన్వాడీల వద్దకు వచ్చిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని తరగతులకూ న్యాయం చేసిందన్నారు. దీనిపై అంగన్వాడీలు స్పందించి తమకు న్యాయం చేయలేదని, ఇచ్చిన హామీ అమలు చేయలేదని మంత్రికి వివరించారు. అంగన్వాడీల కోర్కెలు సమంజసమైనవని, సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. దీనిపై సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడారు. మంత్రి చెప్పిన మాటలు భరోసా కల్పించలేదని అన్నారు. నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదని తెలిపారు. అందువల్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

3న కలెక్టరేట్ ముట్టడి

జనవరి 3న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నామని, కార్యకర్తలు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని సంఘ నాయకులు నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.లతాదేవి, జె.కాంచన, కె.సుజాత, శాంతమణి, మాధురి, లక్ష్మి, హేమ, సరోజిని, భాగ్యలక్ష్మి, జ్యోతి, రాణి, ఎం.శారద, రాజేశ్వరి, జ్యోతిలక్ష్మి, ధూలక్ష్మి పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు



మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్.రాధిక

మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్ విధానం ద్వారా నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్, ఎస్‌పి జి.ఆర్.రాధిక కన్వీనర్‌గా జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా గత నెలలో జరిగిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై, అమలుపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న మూడు నెలల్లో అవసరమైన సిబ్బందిని కేటాయించి... నాటుసారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమన్వయం చేసుకుంటూ నాటుసారా తయారీ ప్రాంతాల్లో తనిఖీలు, కార్డన్ చర్యలు నిర్వహించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి తరలించే అక్రమ మద్యాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అధికారులు పాఠశాలలు, కళాశాలల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా సరిహద్దు కేంద్రాల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఇచ్ఛాపురం పాతపట్నం చెక్‌పోస్టులతో పాటు అదనంగా కొత్తూరు, మెళియాపుట్టి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మరింత భద్రత పెంచుతున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్‌పి కార్యాలయం నుంచి ఎఎస్‌పి జెడి ఎన్.మహేంద్ర, ఎఎస్‌పి విఠలేశ్వరరావు, అదనపు డిఎంహెచ్‌ఒ అనూరాధ, ఆర్‌టిసి డిఎం పి.బి.మల్లికార్జునరావు, ఎస్‌ఇబి అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు కెజిబివి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అందులో భాగంగా శనివారం జ్యోతిరావు పూలే పార్కు వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మద్దత్తు తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాదికారి డి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ అందరికీ కనీస వేతనం, హెచ్‌ఆర్‌ఎ, డిఎ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గిరి, దేవి, అరుణకుమారి, శ్రీనివాసరావు, శివ, అరుంధతి, విమల, ధనుంజయ, రామకృష్ణ పాల్గొన్నారు.

సిపిఎం మద్దతు

సమ్మె శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, సిఐటియు సీనియర్ నాయకులు ఆర్.సురేష్‌బాబులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. న్యాయ సమ్మతంగా ఉద్యోగులు పోరాడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే చర్చలు జరిపి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంఘీభావం

విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి కమిడి కళా వెంకటరావు, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు దీక్షకు సంఘీభావం తెలిపారు. డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అమోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రత ప్రమాణాలు ఉండాలన్నారు. ఏటా మాక్‌డ్రిల్ నిర్వహించాలని, విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమలు మార్గదర్శకాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల కాలంలో విశాఖ జిల్లాల్లో పలు పరిశ్రమల్లో భద్రతా వైఫల్యాల కారణంగానే ప్రమాదాలు వాటిల్లాయని, అలాంటి వాటిని కట్టడి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ జిల్లాస్థాయిలోని పరిశ్రమలో సమర్థవంతమైన రసాయన విపత్తు నిర్వహణ, అలాగే సంక్షోభ ప్రతిస్పందనకు పూర్తి బాధ్యత వహిస్తుందని చెప్పారు. ప్రణాళిక విభాగం, సెర్చ్, రెస్క్యూ యూనిట్, ఉపశమనం, పునరావాసం, కమ్యూనికేషన్, రవాణా, లాజిస్టిక్, చివరిగా అత్యవసర సమయంలో అన్ని వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయడం, ఆస్పత్రిలో మందులు, సిబ్బంది, అంబులెన్స్ అవసరమైన ఇతర సదుపాయాలు ఉండాలనే అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి మోహనరావు, సివిల్ డిఫెన్స్ ఆఫీసర్ కె.పద్మలత, డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ జె.సర్కార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్, పర్యావరణ శాఖ ఇంజనీర్ రామారావు నాయుడు, విపత్తుల నిర్వహణ డిపిఎం పి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమా మహేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ డిఇ ఎస్.సుధాకర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ జి.వెంకటరావు, ఇంకా రెడ్డిస్ లాబొరేటరీస్, యునైటెడ్ బ్రేవరెస్, నాగార్జున అగ్రికెమ్, అరబిందో ఫార్మా, ఆంధ్రా ఆర్గానిక్, స్మార్ట్ కెమ్ టెక్నాలజీ, విశాఖ డెయిరీ, సరాఖ లాబ్ పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో విఒఎల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ... ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తీసుకొచ్చిందని, ఈ సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని విఒఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి.అశిరినాయుడులు డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఒలందరికీ సిబిఒ హెచ్, ఆర్‌పాలసీ అమలు చేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి సంఘాలను కుదించే ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. విఒఎలకు గతంలో చెల్లించాల్సిన వివిధ బకాయిలను విడుదల చేయాలన్నారు. గ్రామ సమాఖ్య సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ప్ అధికారులే చేయడం సరికాదన్నారు. 15 సంఘాల లోపు ఉన్న విఒఎలకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదని అన్నారు. లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు, విఒఎలకు లక్ష్యాలు ఇచ్చే పద్ధతి ఆపాలన్నారు. సమావేశంలో డి.జోగారావు, జి.యర్రయ్య, బి.కనకలక్ష్మి, ఎస్.లక్ష్మి, సిఎచ్.శారద, పి.రమాదేవి, జె.డిల్లెమ్మ, ఎస్.పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాలక్ష్మి

రేపు స్పందన రద్దు

డిఆర్ఒ గణపతిరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి సోమవారము జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ (స్పందన) కార్యక్రమాన్ని ఈ నెల 1న నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రద్దు చేస్తున్నట్టు డిఆర్ఒ ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించి సోమవారం స్పందనలో పాల్గొనేందుకు రావద్దని సూచించారు.

అసమ్మతి జ్వాల... గ్రూపుల గోల

- వైసిపిలో ఎమ్మెల్యేలపై తిరుగుబావుటా
- టిడిపిలో కొనసాగుతున్న గ్రూపుల పోరు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది కాలంలో రెండు ప్రధాన పార్టీల్లో గ్రూపుల పోరు, అసమ్మతి స్వరం కనిపించింది. ప్రధానంగా అధికార వైసిపిలో ఇది కాస్తా ఎక్కువగానే ఉంది. జిల్లాలోని ఒకటిరెండు నియోజకవర్గాల్లో మినహా మిగిలిన అన్ని అసమ్మతి బయట పడింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలకు ధీటుగా పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి అసమ్మతి నాయకులు సవాల్ విసిరారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పార్టీలో నెలకొన్న విబేధాలు రచ్చ కెక్కాయి. వాటిలో ప్రధానంగా ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మూడున్నరేళ్లుగా తీవ్ర అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. ఒంటెత్తుపోకడలు, పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కన పెడుతున్నారన్న ఆవేదనతో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులూ తిరుగబావుటా ఎగురవేశారు. ఎమ్మెల్యే కిరణ్ వద్దు... జగన్ ముద్దు అంటూ రోడ్డెక్కారు. అధిష్టానం ఆదేశాలతో పార్టీలో నెలకొన్న విబేధాల పరిష్కారానికి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు రంగంలోకి దిగి కొంత ప్రయత్నాలు సాగించినా నాయకుల్లో ఆగ్రహం చల్లారలేదు. పాతపట్నం నియోజకవర్గంలోనూ అవే పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకత్వాన్ని తీవ్ర వ్యతిరేకిస్తున్నారు. టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబంలో విభేదాలు అక్కడ పార్టీకి మరింత చేటు తెచ్చాయి. నియోజకవర్గ సమన్వయకర్తగా దువ్వాడ శ్రీనివాస్ స్థానంలో దువ్వాడ వాణికి అధిష్టానం బాధ్యతలు అప్పగిపంచింది. పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకూ అసమ్మతి బెడద తప్పడం లేదు. మందస, పలాస ప్రాంతాల్లో మంత్రికి వ్యతిరేకంగా సమావేశమై తమ గళం విప్పారు. మంత్రి తీరును వ్యతిరేకిస్తూ కొందరు నాయకులు టిడిపిలోకి వెళ్లేందుకు సైతం సిద్ధమవుతున్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం తీవ్ర అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ మూడు గ్రూపులుగా చీలింది. పోటాపోటీ కార్యక్రమాలతో తమ్మినేని నాయకత్వానికి సవాల్ విసురుతున్న పరిస్థితి నెలకొంది. పార్టీ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లో తీసుకువెళ్లి రాజకీయంగా లబ్ధిపొందేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టినా అవి పెద్దగా మైలేజ్ తీసుకురాలేకపోయాయి.

నియోజకవర్గాల్లో గ్రూపుల పోరు మాట ఎలా ఉన్నా తమకే టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్న పలువురు ఎమ్మెల్యేలకు, సమన్వయకర్తలకు అధిష్టానం కొంత షాక్ ఇచ్చే పనిచేసింది. తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత వైసిపి మనసు మార్చుకుంది. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కర్తనలను మార్చాలని భావిస్తున్నట్లు వస్తున్న వార్తలు వారిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా ఎచ్చెర్ల, పాతపట్నంలో అభ్యర్థులను మారుస్తారని జోరుగా ప్రచారం జరుగుతుండగా... ఆమదాలవలసలో శాసనసభ స్పీకర్ తమ్మినేనిని సైతం మారుస్తారన్న చర్చ అంతటా సాగుతోంది.

వైసిపిలో గ్రూపుల పోరు, అసమ్మతిని తమకనుకూలంగా మార్చుకుని ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన టిడిపిలోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో పార్టీ రెండుగా చీలింది. నియోజవర్గ ఇన్‌ఛార్జిలకు వ్యతిరేకంగా పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరామర్శల పేరుతో టిడిపి కుటుంబాలను కలుసుకుంటున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నాయకుడు గొండు శంకర్ సమాంతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గొండు శంకర్‌కు ఏం కేడర్ ఉందని గుండ వర్గీయులు కొట్టి పారేస్తున్నా... కొంతైనా డ్యామేజ్ ఉంటుందన్న ఆందోళన అంతర్లీనంగా ఉంది. టిడిపి పెద్దగా దిక్కుగా ఉన్న ఓ నేతే గొండు శంకర్ గ్రూపును పెంచి పోషిస్తున్నారని గుండ వర్గీయులు ఆరోపిస్తున్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి గెలుపుతో పాటు గుండ లక్ష్మీదేవి గెలిస్తే బిసి, మహిళ కోటాలో మంత్రి పదవి వస్తుందని, ముందుగానే లెక్కలు గట్టి ఆమెకు అధిష్టానం టికెట్ ఇవ్వకుండా టిడిపి పెద్ద నాటకాలు మొదలు పెట్టారని గుండ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుకు అదే నేత పొడబెడుతున్నారని కళా వర్గీయులు ఆరోపిస్తున్నారు. టిడిపి నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు నియోజకవర్గంలో పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలిశెట్టిని ఎగదోస్తోంది కింజరాపు కుటుంబమేనన్న చర్చసాగుతోంది. మరోవైపు పాతపట్నం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు టిడిపి నాయకుడు మామిడి గోవిందరావు తలనొప్పిగా మారారు. టిడిపి కుటుంబా పరామర్శ, ఆర్థిక సాయం పేరుతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో టిడిపి రాష్ట్రానికి ఇదేం కర్మ పేరుతో పాతపట్నం నియోజకవర్గం హిరమండలంలో బస్సు యాత్ర మొదలు పెట్టి అన్ని నియోజకవర్గాల్లోనూ తిరిగారు. రకరకాల కార్యక్రమాలతో జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నించినా నాయకుల మధ్యమాత్రం ఐక్యత కొరవడింది. ఏడాది రెండో అర్థభాగంలో టిడిపి, జనసేన పొత్తు కుదరడంతో ఇరు పార్టీల్లో ఉత్సాహం కనిపించింది. రెండు పార్టీలకు చెందిన నియోజకవర్గ ముఖ్య నేతల సమన్వయ భేటీలు సైతం నిర్వహించారు. అయితే వీరి సమన్వయం రాబోవు ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత ఉపయోగపడుతుందో వేచి చూడాల్సి ఉంది.

జనం తమ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని గుర్తించినా బిజెపి కూడా జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు సాగించింది. వికసిత్ సంకల్ప యాత్ర పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై మరోసారి ప్రచారంతో ఊదరగొట్టింది. దానిపై జనంలో పెద్దగా స్పందన కనిపించలేదు. వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి పక్షాన నిలబడే ప్రయత్నం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల భారం, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలను సాగించింది.

ఒక్కొక్కరుగా ఆందోళనబాట



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం ఇచ్చిన హామిల అమలు, కనీస వేతనాల కోసం ఇప్పటికే అంగన్‌వాడీలు, సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. తాజాగా ఈ నెల 26 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజ్ వంటి డిమాండ్లతో పాటు ముఖ్యమంత్రిగ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఇచ్చిన హామిలు అమలు చేయాలని ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వివిధ రూపాల్లో పోరాడుతూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అనివార్యంగా సమ్మెకు దిగాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. అసలే కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లాలోనూ ఇటీవల కాలంలో కోవిడ్ కేసులూ పెరుగుతున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్లు, గార్బేజీ డ్రైవర్లు, అండర్ గౌండ్ డ్రైనేజీ మలేరియా విభాగాల్లో పని చేసే కార్మికుల అంతా సమ్మెలో ఉండటంతో పారిశుధ్యం పడకేసింది. కరోనా వ్యాప్తి తీవ్ర ఉన్న సమయంలో వీరు అందించిన సేవలు ఏపాటివో ఎవరికీ తెలియందేమి కాదు. ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తర్వాత వీరి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో సమ్మెను వారించి వారితో చర్చలు జరపాల్సిన ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వీధులను, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య భద్రతను కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు మాత్రం ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నిరాకరిస్తోంది. రోడ్లపై కుళ్లిన కళేబరాలను, రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త నుంచి వస్తున్న దుర్వాసనను సైతం భరించి విధులు నిర్వర్తిస్తున్న వారికి ప్రభుత్వం పట్టుమని పది వేలు కూడా ఇవ్వడం లేదు. చెత్త తొలగింపు, కాలువల్లో క్లీనింగ్ వంటి పనులు వారు కాకుండా ఇంకెవరైనా ఈ రకం పనులు చేసేందుకు ముందు వస్తారా? అటువంటి దయనీయ పరిస్థితుల మధ్య పని చేస్తున్న వారిపై కనీసం దయ చూపకపోవడం ప్రభుత్వానికే చెల్లింది. మున్సిపల్ కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో చూడాల్సిన ప్రభుత్వం వారిపైనా కఠినంగా వ్యవహరిస్తోంది. చెత్త తొలగింపు కోసం ప్రత్యామ్నాయ పద్ధతులను అన్వేసిస్తూ వారి సమ్మెను నిర్వీర్యం చేయాలని చూస్తోంది

గౌరవ వేతనం పేరుతో ఏళ్ల తరబడి తమతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు సైతం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షకు దిగారు. ప్రతిపక్ష నేతగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామిలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయులు, ఉద్యోగులూ ఆందోళన బాట పట్టారు.

ఆర్థిక సంబంధిత బకాయిలు విడుదల, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ తాలుకా కేంద్రాల్లో ఈ నెల 27న ఆరు గంటల ధర్నా నిర్వహించారు. జనవరి మూడో తేదీన 12 గంటల ధర్నా, 9,10 తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నాకు సమయాత్తవుతున్నారు. అంగన్‌వాడీల సమ్మె ఇప్పటికే 19వ రోజుకు చేరింది. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 11వ రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ తరగతులకు చెందిన కార్మికులు సమ్మెలు, దీక్షలు కొనసాగిస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రం వచ్చే ఎడాది జరగనున్న ఎన్నికలపైనే తన ధ్యాస పెట్టినట్లుగా కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు, గెలుపు అవకాశాలపైనే దృష్టి సారించారు. ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను విస్మరించి, ఎంఎల్‌ఎలపై వ్యతిరేకత ఉందంటూ మార్చేందుకు సిద్ధమవుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఇలాగే వ్యతిరేకత మూటగట్టుకుంటే అభ్యర్థులను మార్చినా ఫలితముండదనే విషయం ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - బూర్జ

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైసిపికే దక్కుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలో ఉప్పినివలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు జనం నీరాజనం పడుతున్నారన్నారు. ప్రతి గడపకు వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండలపార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

సీనియర్ సిటిజన్ల అనుభవం సమాజానికి మేలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సీనియర్ సిటిజన్ల అనుభవం సమాజానికి మేలు చేకూరుతాయనిజిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు వారి వారి వృత్తి, రంగాల్లో అపారమైన అనుభవం గడిచి ఉంటారని అన్నారు. భావితరాలకు వారి అనుభవము ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం న్యాయవాది అన్నెపు సత్యనారాయణ సీనియర్ సిటిజన్ల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, సీనియర్ సిటిజన్లు కేశవరావు, శ్యాంబెహరా, సత్యనారాయణ, రామచంద్రరావు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఎపిటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో ఎంఇఒ-2 పట్నాన రాజారావు, సీనియర్ కామ్రేడ్ దండా సూరిబాబు చేతులమీదుగా శనివారం ఎపిటిఎఫ్ 2024 డైరీ, కేలండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోగదాల రమణారావు, తేజేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, నాయకులు జవహర్ గుప్తా, రవికుమార్ పాల్గొన్నారు.



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

కుళాయి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో రావివలస గ్రామంలో ఇంటింటికి జలజీవన్ మిషన్ ద్వారా కుళాయిలకు సర్పంచ్ సర్లాన బాలకృష్ణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం కలిసి గ్రామాలకు ఇంటింటి కొళాయిల ద్వారా ప్రజలకు దాహం తీరుస్తున్నారన్నారు. గ్రామానికి రూ.21 లక్షల 30 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. దీంతో ప్రజల దాహం తీరుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బెండి గురునాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ త్రినాధరావు

దేశాభివృద్ధికి పాటుపడాలి


ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థులు వివక్షతకు గురికాకుండా వారి హక్కులను తెలుసుకొని పాఠశాల దశ నుంచే వారి అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి పాటు పడాలని ఎంఇఒ అజ్జాడ త్రినాధరావు అన్నారు. శనివారం ఎంఆర్‌సిలో యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా రణస్థలం, లావేరు మండలాల్లో 26 హైస్కూల్స్, 2 కళాశాలలకు సంబంధించి 55 మంది విద్యార్థులకు బాలలహక్కులు, విధులు, భాద్యతలు నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను తెలుసుకొని వారి అవసరానికి అనుగుణంగా సదుపాయాలు కల్పించే విధంగా బాలలహక్కుల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకుంటూ చదువును భోధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ బి.సురేంద్ర, ప్రాజెక్ట్ లెర్నింగ్ కో-ఆర్డినేటర్ కరుణాకరరావు, వై.శంకరరావు, అడప రమణమూర్తి, ఉపాధ్యాయులు కల్పన, వనిత పాల్గొన్నారు.

విద్యార్థినులకు బిగ్‌హెల్ప్ వితరణ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ అధ్వర్యంలో 15 మంది అనాధ, నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థినులకు నెలవారీ వస్తువులను శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు సెప్టెంబరు నెలకు సంబంధించి కాస్మోటిక్ వస్తువులు, అక్టోబర్ నెలకుగాను లోదుస్తులు, నవంబర్ నెలకుగాను దుప్పట్లు, డిసెంబర్‌కు గాను కొత్త బట్టలు పంపిణీ చేశారు. వీటిని పాఠశాల హెచ్‌ఎం ఎం.భానుప్రకాష్, నౌపడ ప్రాజెక్టు చైర్మన్ సివి రాజా మాస్టర్, బిగ్‌హెల్ప్ డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు బాగా చదువులో రాణించాలని, అవసరమైన మేరకు బిగ్‌హెల్ప్ ప్రాజెక్టు తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, అసిరినాయుడు, రమేష్, లావణ్య, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేస్తున్న బిగ్‌హెల్ప్ ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



శ్రీకాకుళం అర్బన్ : ఒంటికాళ్లపై నిరసన తెలియజేస్తున్న తేజేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి చర్చల పేరుతో తాత్సారం చేస్తున్నారని, చర్చల విఫలం కావడంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. పాదయాత్రలో అసెంబ్లీ సాక్షిగా జగన్ అన్న ఇచ్చిన హామీలు అమలుకు నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులంతా విధులు బహిష్కరించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నగరపాలక సంస్థ, ఆముదలవలస, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో కార్మికులంతా సమ్మెలో బాగస్వాములై ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నామన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు కోసం మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌ను ఆప్కాస్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ, రాజు, అర్.జి.రాము, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, జె.మాధవి, ఎ.మోహన్, డి.యుగంధర్, ఎ.మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు, డి.సురేష్ కుమార్, ఎం.అప్పన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందించారు. కనీస వేతనం అమలు చెయ్యాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యాలయం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు.

ఆమదాలవలస: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద కార్మికులు చేస్తున్న నిరవదిక సమ్మె శిబిరం వద్దకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో రెగ్యులర్ చేసి సమాన పనికి సమానం వేతనం చెల్లిస్తామని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్‌ను వారం రోజుల్లోనే రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పాత్రుని పాపారావు, సరుబుజ్జిలి జనసేన మండలాధ్యక్షుడు పైడి మురళీమోహన్, జనసైనికులు కోటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

క్రీడలతోనే మానసికోల్లాసం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలో కనుగులవలసలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలు క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకే క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, ఎంపిటిసి ప్రతినిధి పొన్నాడ కృష్ణారావు, గురుగుబెల్లి నీలారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఆడుదాం ఆంధ్రా క్రీడలను సుందరాడ పాఠశాల ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ప్రారంభించారు. క్రీడల్లో నైపుణ్యత గల వారిని గుర్తించేందుకు ఈ క్రీడలు దోహదమవుతాయన్నారు. క్రీడలు యువతకు మానసిక ఉల్లాసానికి దోహదమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఇఒ తిరుపతి పట్నాయక్, భాస్కరదాస్, జయముని, అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కవిటి: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు మండలంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శిలగాం సచివాలయం పరిధిలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యువ క్రీడాకారులను గుర్తించే కోవలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కడియాల బాబురావు, కరగాన వల్లభరావు, పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న స్పీకర్ సీతారాం

పిఎస్‌ఒల తొలగింపులో అలసత్వం వద్దు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితా నుంచి ఫొటో సారూప్య (పిఎస్ఇ), డేటా సారూప్య నమోదులు (డిఎస్ఇ) తొలగించడంలో ఎలాంటి అలసత్వం పనికిరాదని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. విఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓకే ఫొటోతో రెండు అంతకు మించి ఉన్న ఓట్లను తొలగించడం, సరిచేయడంలో ఇచ్ఛాపురం, సోంపేట, ఎచ్చెర్ల తహశీల్దార్లు నిర్లక్ష్యం వహించారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంకా చాలాచోట్ల ఒకే ఇంటి నంబరుతో ఉన్న ఓట్లను సరిచేయాలన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులందరూ రెండు రోజుల్లో దాదాపు ఐదు వేల పిఎస్ఒ, డిఎస్‌ఒలను తప్పక సరి చేయాలన్నారు. ఎక్కడా సాంకేతిక లోపం లేదని, సవరణలకు, క్లైముల పరిష్కారానికి జనవరి 12ను ఎలక్షన్ కమిషన్ డెడ్‌లైన్‌గా విధించిందని అన్నారు. జనవరి 22న పూర్తి స్థాయి ఓటర్ల జాబితా ప్రచురణ ఉందని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిటి ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

గురుకులంలో అటల్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలు, కళాశాల ఆవరణలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభించారు. నగరంలోని పెద్దపాడు గురుకులంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను డిసిఒ బాలాజీ నాయక్ ప్రారంభించారు. ముందుగా రిబ్బన్ కత్తిరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. స్టాళ్ల డిస్ప్లే డిజిటల్ బోర్డ్స్, ఆటోమేటిక్ క్రాప్ ఎలక్ట్రికల్ లైట్, రోబో, వివిధ రకాల పేపర్లతో, వేస్టేజ్ మెటీరియల్‌తో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు మంచి జ్ఞానం పెంపొందించడానికి ఇటువంటి ఎగ్జిబిషన్స్ తోడ్పడతాయని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ మాధవీలత, దుప్పలవలస ప్రిన్సిపాల్ దేవేందరరావు, ఉపాధ్యాయులు ఐశ్వర్య, మంజుశ్రీ, హైమా, పుష్పశ్రీ పాల్గొన్నారు.

మూడో రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారం కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు మూడోరోజుకు చేరుకున్నాయి. ఆటోస్టాండ్ ఎదురుగా వేసిన టెంట్‌లో బెంతు ఒరియా యువకులు దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. రెండోరోజు దీక్షల్లో ఢిల్లీ దోలై, మోహన్, దయానిధి, సుమన్, జయసేన్, బృందావన్, మేఘనాధ్, హరికృష్ణ, ప్రేమ్ కుమార్, చింతామణి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాములమ్మ

గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జగన్నాథపురంలో గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించిన పౌష్టికాహార కిట్లను సర్పంచ్ జోగి రాములమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పుక్కళ్ల లక్ష్మణరావు, లండ రామారావు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

నౌపడ: విద్యార్థుల చదువులకు పేదరికం అడ్డు రాకూడదని దృఢ సంకల్పంతో సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం బిసిహాస్టల్‌లో 90 మంది విద్యార్థులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యారంగంలో వినూత్న మార్పులకు మంత్రి శ్రీకారం చుట్టారని, నాడు-నేడు ద్వారా పాఠశాల భవనాలు అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, వార్డెన్ ఆనందరావు, నౌపడ సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్ రెడ్డి, వైస్ సర్పంచ్ రవికుమార్, ఎంపిటిసి సుధాకర్, మోహన్‌రెడ్డి, చిన్ని జోగారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రూ.3 వేలు పింఛను



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పింఛను కానుక జనవరి నెల నుంచి రూ.3 వేలు చొప్పున లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. జిల్లాలోని అధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రధానమైన నాలుగు ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. వైఎస్ఆర్ పింఛను కానుక 1 నుంచి నుంచి 9 వరకు, వైఎస్ఆర్ ఆసరా జనవరి 24 నుండి 31 వరకు, చేయూత ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. 8 రోజులకు ఒక షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. ప్రీ లాంచ్, లాంచ్ డే, పోస్ట్ లాంచ్ మూడు దశల్లో జరుగుతుందన్నారు. అన్ని కార్యక్రమాల్లోనూ ముఖ్యమంత్రి ఆడియో, వీడియో సందేశం అందరూ చూసేలా ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రి సంతకంతో కూడిన పోస్టర్లను అందజేయాలన్నారు. విజయవాడలో 19 ఎకరాల్లో డాక్టర్ బి.అర్.అంబేడ్కర్ విగ్రహం జనవరి 19న ఆవిష్కరించిన రోజునే అన్ని సచివాలయాల్లో సోషల్ జస్టిస్ పేరుతో బోర్డు ఏర్పాటు చేసి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. విజయ గాధలను వీడియో రూపంలో అప్ లోడ్ చేస్తే సచివాలయం స్థాయిలో రూ.పది వేలు, మండల స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్రామన్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డిడి, గ్రామవార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడెమ్మ, బిసి కార్పొరేషన్ ఇడి, మైనారిటీ వెల్ఫేర్ ఇడి, నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు చేయడం మానుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీ కల్యాణ వెంకటేశ్వర వేదిక కళ్యాణ మండపంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లావేరు సాక్షి విలేకరి దాము ఆత్మహత్య ఘటన దురదృష్టకరం. వాస్తవాలు పూర్తిగా తెలియకుండా టిడిపి నాయకులు రణస్థలంలో కళా వెంకటరావు, కుప్పంలో చంద్రబాబు నాయడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. రాజకీయ లబ్దికోసం శవ రాజకీయాలు మానుకోవాలన్నారు. వైసిపి కార్యకర్తగా ఆయన లేని లోటు తీరనిదన్నారు. జర్నలిజం విలువలు పాటించే వ్యక్తుల్లో దాము ఒకడన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యం, మానసిక ఆందోళనతో చికిత్స పొందుతున్నాడని మిత్రులు, కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు. చికిత్స పొందుతూనే దురదృష్టవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులమడం ఏ రాజకీయ పార్టీలకు తగదన్నారు. తాను వేధించి వుంటే ఆ గ్రామ పార్టీ పెద్దలు, తోటి విలేకరులు, కుటుంబ సభ్యులతో తప్పక చర్చించి ఉండేవాడని, అలాంటిది ఏమీలేదని కుటుంబ సభ్యులే చెప్పన్నారన్నారు. దాము మృతికి కారణాలు పోలీసులు విచారణ చేస్తున్నారని, కీలక ఆధారాలు లభించాయని, త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. దాము కుటుంబానికి వైసిపి అన్నివిధాల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, లావేరు మండల ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

అధికారుల తీరుపై అధికార పార్టీ నేతల ధ్వజం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఏడాది చివరరోజు వాడీవేడిగా జరిగింది. అధికార వైసిపి వార్డ్ కౌన్సిలర్‌లు అధికారుల తీరుపై మండిపడ్డారు. చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి మాట్లాడుతూ మున్సిపల్ స్టాండింగ్ వకీలు నియామకంపై అధికారులు ఉద్దేశ పూర్వకంగా దరఖాస్తుదారులకు తప్పుదోవ పట్టించారన్నారు. గత సమావేశంలో స్టాండింగ్ వకీలు నియామకంపై బార్ అసోసియేషన్‌కి లేఖ పెట్టమని సూచించామని చెప్పడంతో ఈ నెల 10లోగా దరఖాస్తులు పిలిచి వచ్చిన దరఖాస్తులు గడువు దాటిన తర్వాత వచ్చినట్లు తిరస్కరించడం దారుణమన్నారు. ఈ అంశంపై తీవ్ర చర్చ జరిగింది. కమిషనర్ రమేష్ సమాధానం ఇస్తూ ఉద్దేశ పూర్వకంగా చేయలేదని, గడువులోగా దరఖాస్తులు రాకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. కోతులు, కుక్కలు నియంత్రణలో నిర్లక్ష్యం మంచిది కాదన్నారు. కోతులు నియంత్రణలో ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం చెప్పడంతో అధికారులతో స్వయంగా మాట్లాడడం జరిగిందనిచైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటేనే చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. వైస్ ఛైర్పర్సన్ భారతీ దివ్య మాట్లాడుతూ రోడ్లుపై వదిలిపెట్టే ఆవులను అదుపులోకి తీసుకోని సంబంధిత యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లుపడాలో కొటీరు బంద్ చెరువు ఆక్రమణపై ప్రత్యేక సమావేశం ఎందుకు పెట్టలేదని కౌన్సిలర్ ఆసీ లీలారాణి ప్రశ్నించారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, సాలీనా ఢిల్లీ, వార్డ్ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. బడ్జెట్లో ఒక అంశంలో రూ.2.07 లక్షలకు సవరణలో రూ.27 లక్షలుగా బడ్జెట్లో అంకెలు తప్పుపడిందని దీని వల్ల మొత్తం బడ్జెట్లో 20 లక్షల వ్యత్యాసం రావడంతో బడ్జెట్ స్వరూపం మారిపోతుందని దీనిని సరిచేయాలని టిడిపి ఫ్లోర్ లీడర్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ చేపల చెరువు వలన ఏడాదికి రూ.10వేలు, రూ.20 వేలు ఆదాయం చూపిస్తున్నారని, అసలు ఎన్ని చెరువులు ఉన్నాయో వివరించాలన్నారు. సొసైటీలకు వేలం పాట ద్వారా ఇస్తే మున్సిపాలిటీకి ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. చైర్మన్ గిరిబాబు సమాధానమిస్తూ ఇకపై చెరువులు అన్ని సొసైటీలకే వేలం ద్వారా అప్పగించడం జరుగుతుందన్నారు. దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో కబేళాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారని, విచ్చలవిడిగా ఆవు మాంసం విక్రయాలు జరుగుతున్నాయని దీనిని అరికట్టాలని కోరారు. బడ్జెట్ ప్రారంభనిల్వ 2022-23కు రూ.26.46,94,478, 2023-24 అంచనా బడ్జెట్ రూ.28.91.46.679 చూపించి, సవరణ బడ్జెట్ రూ. 26.96.10.783 వేయగా రూ.28.81,18,006లును అంచనా బడ్జెట్‌తో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



రహదారి పక్కన బోల్తా పడిన లారీ

ఇసుక లారీ బోల్తా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో వంశధార నది పరివాహక ప్రాంతం చవ్వాకులపేట రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న లారీ శుక్రవారం రాత్రి రోడ్డుపక్క బోల్తా పడింది. వంశధార నది నుంచి ఇసుకను తరలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు కెపాసిటీకి మించిన బరువులతో ఇసుక లారీలు వెళ్లడంతో రోడ్డు గోతులు, గుంతలుగామారి రహదారి పాడైపోయింది. లారీగోతుల్లో పడి బ్యాలెన్స్ తప్పి పొలాల వైపు బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. డ్రైవర్‌తో పాటు క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. తరుచూ ఈ రహదారిపై ఇసుకలారీలు గోతుల్లో దిగబడడం బోల్తా కొట్టడం జరుగుతున్నాయని, ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో ప్రయాణాలు కొనసాగిస్తున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇసుక లారీలను నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో రహదారినైనా బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్‌ల చోరీ

భయాందోళనలో పట్టణ వాసులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో గతకొద్ది రోజులుగా దర్జాగా వచ్చి బైకులు వరుసగా చోరీలు జరగడంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. అత్యంత రద్దీ ప్రాంతంలో రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య దర్జాగా బైక్ చోరీలు జరుగుతున్నాయి. ప్రధానంగా గ్లామర్, పల్సర్, బుల్లెట్ వంటి వాహనాలు చోరీ జరుగుతుంది. చోరీలు జరుగుతున్న ప్రాంతంలో సిసి కెమెరాకి చిక్కకుండా అత్యంత నేర్పుతో వాహనాలు తస్కరిస్తున్నా నేటివరకు పట్టు బడలేదు. బైక్‌లు చోరీలపై బాధితులు స్వయంగా వెళ్ళి పోలీస్ అధికారులకు చెప్పిన కేసులు నమోదు కావడం లేదని బాధితులు చెపుతున్నారు. నిఘా పెట్టడం జరిగింది తొందరలో బైక్ చోరీలు చేస్తున్న దొంగలను పట్టుకుంటామని పోలీస్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కేవలం రెండు నెలల్లో అధికారికంగా మూడు బైక్‌లు, అనధికారికంగా ఏడు బైకులు చోరీకి గురవుతున్నట్లు సమాచారం. వరుసుగా జరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ అలీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

డిసెంబర్ 31న యువత గ్రామ, మండల కేంద్రంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ అన్నారు. న్యూ ఇయర్ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలు కంటే ముందురోజు 31 రాత్రి యువత తాగిన మైకంలో అత్యుత్సాహం ప్రదర్శించకుండా వేడుకను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. డిసెంబర్ 31వ రోజు న్యూ ఇయర్ వేడుకలు ముగిసేంతవరకు పూర్తిస్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, అందులో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలో, వివిధ కాలనీలో వీధి దీపాలను ధ్వంసం చేయడం, ప్రభుత్వ ఆస్థులకు భంగం కలిగిస్తే ఉపేక్షించమన్నారు.




మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షుడు గణపతి

వ్యక్తిత్వ వికాసంతోనే మంచి జీవితం

ప్రజాశక్తి- సోంపేట

వ్యక్తిత్వ వికాసంతోనే సంస్కారవంతమైన జీవితం సాధ్యమవుతుందని ప్రముఖ మనోవికాస నిపుణుడు రామ్‌బుడ్డి గణపతి అన్నారు. శనివారం జాగృతి స్వచ్ఛందసంస్థ 15వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని కొర్లాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. అలాగే భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ప్రతిఒక్కరు మంచి వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిఏటా గండు తులసి నారాయణ మాస్టారి జ్ఞాపకార్థం అందించే జానపద కళ అవార్డును కవిటి మండలం డొంక పుట్టుకకు చెందిన దారుశిల్పి షణ్ముఖరావుకు అందజేశారు. కార్యక్రమంలో పి.పట్టాభి, వాసుదేవరావు, వెంకటరావు, జానకిరామ్, ఎస్.రాజు, మోహన్‌రావు, బాలరాజు పాల్గొన్నారు.



కృష్ణారావును కలిసి మాట్లాడుతున్న కృష్ణ

మాజీ మంత్రిని కలిసిన కృష్ణ

సోంపేట: యానం మాజీ మంత్రి, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావును సోంపేట మండలానికి చెందిన రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ రెయ్యి కోదండ కృష్ణ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు తెలియజేశారు. మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సామాజిక భవనాన్ని విజయవాడలో తమ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవన నిర్మాణానికి దాతలు సహకారం అందించేలా చూడాలని కోరారు. పల్లవసేన అధ్యక్షుడు బాబురావు, వెంకటేశ్వరరావు, గజమాల వ్యవస్థాపకులు చింత నాగరాజు, హరికృష్ణ, సిహెచ్ పాపారావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కంచిలి: మండలం జలంత్రకోట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం సత్కరించారు. ఎంఇఒ చిట్టిబాబు, హెచ్‌ఎంలు త్రినాథ్ సాహూ, భాస్కర్ మిశ్రాల ఆధ్వర్యంలో బదిలీ ఉపాధ్యాయులు రఘుమని మహంతి, జాకబ్ లిమ్మా, శరత్‌లను దుశ్శాలువలు కప్పి సత్కరించారు. యుటిఎఫ్ నాయకులు నల్లన రవి, సుదర్శన్ బెహరా, ఉపాధ్యాయులు సీతారాం, సునీల్, కృష్ణచంద్ర, దుర్గాప్రసాద్ పాడి పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న సభ్యులు

మహిళకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థికసాయాన్ని అందించి ఉద్దానం అభ్యుదయ సేవాసమితి కొమరల్తాడ సభ్యులు తమ ఉదారతను చాటుకున్నారు. రెయ్యిపాడు గ్రామానికి చెందిన ఉమ, తన భర్త కూలి పనులు చేసుకుంటూ తమ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. ఇటీవల ఉమకు రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధ పడుతుంది. విషయం తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవాసమితి సభ్యులు ఉమ కుటుంబీకులను శనివారం కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఉమ ఆపరేషన్‌కు సుమారు రూ.25 లక్షలవరకు ఖర్చవుతుందని దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి ఆమె వైద్యానికి సహకరించాలని సేవా సమితి కొమరల్తాడ అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎం.మహేష్, డి.పాపారావు, శ్రీను, మోహిని, ఉమ, రోహిణి, సీత పాల్గొన్నారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న లక్ష్మీదేవి

ఇచ్చిన హామీలు ఏమైనట్టు?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలను మభ్యపెట్టి అధికారం కోసం సిఎం జగన్ హామీలు ఇచ్చారని, నాలుగున్నరేళ్లలో నమ్మిన వారిని నట్టేట ముంచి హామీలను విస్మరించారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలివద్ద నవ మోసాల పేరిట ముద్రించిన పుస్తకాన్ని శనివారం ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం అప్పచెప్పిన అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలోను, పాదయాత్రలో ఇచ్చిన హామీలు నవరత్నాల పేరిట నవమోసాలకు పాల్పడ్డారన్నారు. వైసిపి నాయకుల మోసం, దగా నయవంచన ప్రజలు అర్థం చేసుకొని రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి, సింతు సుధాకర్, పి.ఎం.జె.బాబు, జామి భీమశంకర్, బొణిగి భాస్కరరావు, కవ్వాడి సుశీల, సీపాన రమ పాల్గొన్నారు.

రోటరీనగర్‌లో రహదారులేవీ?

ప్రజాశక్తి- పలాస


అధ్వాన రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

కాశీబుగ్గ రోటరీనగర్‌లో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందులు పాలకులకు కనిపించడం లేదా అంటూ జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ప్రశ్నించారు. రోటరీ నగర్‌లో కళింగవీధిని జనసేన నాయకులు గుంట కిరణ్, నందిగాం ధర్మారావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణవాసులు పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. కనీస మౌలిక సదుపాయాలు రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోటరీనగర్‌లో పలువీధులు రహదారి సౌకర్యానికి నోచుకోలేని మంత్రి అప్పలరాజు దృష్టికి రాకపోవడం వింతగా ఉందన్నారు. జనసేన, టిడిపి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో పట్టణ ప్రజలకు మౌలిక సౌకర్యాలకు పెద్దపీట వేస్తామన్నారు.

అపరిశుభ్రతతో అవస్థలు

ప్రజాశక్తి- ఆమదాలవలస


ముక్కు మూసుకుని ప్రయాణిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పారిశుధ్య కార్మికులు గడచిన ఐదు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుండడంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఎదుట గడచిన రెండు రోజులుగా చెత్తను మున్సిపల్ సిబ్బంది తరలించకపోవడంతో చెత్తపేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దుర్గంధం భరించలేక ముక్కు మూసుకుని నానా ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు వెళ్తున్నారు. కుక్కలు అక్కడకు చేరి చెత్త పోగులను చిందరవందర చేస్తూ అటువైపుగా వెళ్లే విద్యార్థులపైకి దాడి చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను పాఠశాలకు పంపించాలంటే భయపడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పురపాలకసంఘ పరిధిలో చింతాడ, వెంకయ్యపేట, ఊసవానిపేట, లక్ష్ముడుపేట పలు వార్డుల్లో చెత్తపేరుకుపోయి నానా ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెత్తను తరలించి తమ ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

వినియోగదారుల రక్షణచట్టంపై అవగాహన

ప్రజాశక్తి- పలాస



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

పలాస మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో వినియోగదారుల జాతీయ దినోత్సవం పురస్కరించుకొని శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్రా కార్యదర్శి న్యాయవాది అనిల్ రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆస్రా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ హక్కులు, బాధ్యతలపై వివరించారు. వినియోగ దారుల రక్షణచట్టం 2019తో సత్వరన్యాయం పొందవచ్చునని, విద్యార్థి దశ నుంచే అవగాహన ఉంటే స్వచ్ఛమైన ఆర్థిక సమాజం ఏర్పాటు జరుగుతుందన్నారు. న్యాయవాది అనిల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే అవగాహన పెంచుకుని ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వప్న, స్వాతి, ప్రమీల, రేవతి, న్యాయవాదులు కట్టా పార్థ సారధి, లఖినాన రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో పాలన సాగిస్తున్న సిఎం జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి ఆర్థిక క్రమ శిక్షణ కొరవడడం వల్లే అప్పుల పాలయ్యారని, గతంలో 14 ఏళ్ల పాలన సాగించిన చంద్రబాబు ప్రభుత్వం ఏనాడూ రాష్ట్రాన్ని ఇలాంటి పరిస్థితులు తీసుకురాలేదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు విర్శించారు. అరసవల్లిలోని వారి స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నిజాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలోని ఆర్థిక వనరులను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మద్యం, మైన్స్, భూములు, ఇసుక వంటి ప్రకృతి సంపదలను కొల్లగొట్టి ఆ సొమ్ము ఎక్కడ పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. వంశధార నదిపై నిర్మించిన గార వంతెన, సింగుపురంలో నిర్మించిన నర్సింగ్ కాలేజ్, హాస్టల్, కళింగపట్నం ఎత్తిపోతల పథకం, కోడిరామ్మూర్తి స్టేడియం ఎందుకు పూర్తి చేయలేదన్నారు. అలాగే ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు గోతులుగా మారడానికి ఎవరు కారణమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలు పట్టించకుని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

మండలస్థాయి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న తులసీ దాస్ రెడ్డి

స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థలో మండలస్థాయి క్విజ్ పోటీలు చైర్మన్ చాట్ల తులసీ దాస్ రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. హైస్కూల్ స్థాయిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా తులసీదాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మేధాశక్తిని పరీక్షించడానికి ఇటువంటి క్విజ్ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, కో-ఆర్డినేటర్ నీలిమ రెడ్డి, ప్రిన్సిపాల్ గౌరి శంకర్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జల్లు జయ ప్రకాష, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సందీప్ పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

ప్రజాశక్తి- బూర్జ

కూరగాయల సాగుతో అధిక లాభాలను పొందవచ్చునని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. న్యూఢిల్లీ కర్త ఫౌండేషన్ విద్యార్థులు శనివారం సందర్శించారు. తమ సంస్థ తరఫున రైతులకు వ్యవసాయ ఉద్యానవన శాఖాధికారులు అందజేసిన సూచనలను పాటిస్తే దిగుబడులతో పాటు అధిక లాభాలు పొందవచ్చునన్నారు. అలాగే నిరుపేద విద్యార్థులకు దేశ, విదేశాల్లో అత్యున్నతమైన విద్యను అందజేసి వారి జీవితాలకు బంగారు బాటలు వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కర్త ఫౌండేషన్ ప్రతినిధి అపర్ణ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి


విలేకరులతో తో మాట్లాడుతున్న తిలక్

బాబాయ్, అబ్బాయ్‌లు జిల్లా అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధామా అంటూ రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సవాల్ విసిరారు. శనివారం మండలం జర్జంగి గ్రామంలో వైసిపి నాయకుడు అన్నెపు రామారావు ఇంటివద్ద విలేకరులతో మాట్లాడారు. వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, పశుసంవర్ధక శాఖామంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌లు మూలపేట పోర్ట్ పనులు పరిశీలన పర్యటనలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్రలో చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమంపై ప్రజలకు తెలియజేసే సందర్భంలో టిడిపి గడిచిన 40 సంవత్సరాల్లో ఈ జిల్లాకు, ఈ ప్రాంతానికి ఏం చేసిందో చెప్పాలని నారా లోకేష్‌ని మంత్రి అప్పలరాజు అడిగితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు శుక్రవారం మాట్లాడుతూ నవరత్నాలు బోగస్ అని, మేనిఫెస్టోలో 85శాతం అమలు చేయలేదని మాట్లాడడం అవివేకమన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ రామ్మోహన్ నాయుడుని ప్రశ్నిస్తూ మీరు ఎంపీగా ఎన్నికైన తర్వాత కేంద్ర నిధులు ఎంతమేరకు సద్వినియోగం చేసారో తెలిపాలన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన మీ తండ్రి యర్రన్నాయుడు మన జిల్లాలో ఒక్కటైనా శాశ్వతమైన పనిచేస్తే చెప్పాలని సవాల్ విసిరారు. కింజరాపు కుటుంబ రాజకీయ చరిత్రలో ఈ జిల్లాకు, టెక్కలి నియోజకవర్గానికి ప్రజామోదం పొందిన ఒక్క పనైనా చేస్తే తెలిపారన్నారు. సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరమణారావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ హేమసుందరరాజు, సీనియర్ నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, వైస్ ఎంపిపి దుక్క రోజా పాల్గొన్నారు.

బిటి రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శారదాపురం జంక్షన్ నుంచి గుల్లలపాడు మీదుగా నగరంపల్లి రోడ్డుజంక్షన్ వరకు నిర్మించనున్న బిటిరోడ్డు పనులను సచివాలయ కన్వీనర్ బగాది శ్రీకాంత్ శనివారం ప్రారంభించి మాట్లాడుతూ మూడు దశాబ్దాల గ్రామస్తుల కల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితో నెరవేరుతుందన్నారు. 2020లో రూ.98 లక్షలతో నిర్మించనున్న ఈ రోడ్డుకు శంకుస్థాపన చేసినప్పటికీ కొన్ని కారణాలు వలన రోడ్డు పనులు ఆలస్యం అయినట్లు తెలిపారు. గుల్లలపాడు రోడ్డు పనులను మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ మొదలవలస మన్మథరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దువ్వాడ శంకరరావు, పిఎసిఎస్ డైరక్టర్ బగాది హరికృష్ణ, దువ్వాడ విష్ణు, తమ్మినాన బాలకృష్ణ, రాంప్రసాద్, శిష్టు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాఘవదాసు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటరత్నం

స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లాకు చెందిన త్రిపురాన రాఘవదాసు ఎందరో జిల్లా వాసులకు స్ఫూర్తిగా నిలిచారని మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం అన్నారు. నగరం శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో రాఘవదాసు విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీజీ పిలుపును అందిపుచ్చుకొని జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను రాఘవదాసు నిర్వహించారన్నారు. శాసనమండలి సభ్యునిగా పనిచేసిన నిస్వార్థంగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాల మాన్ సింగ్, టిడిపి పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జీ, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, గాంధీ మందిర బృందం బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, సటుకుల మోహన్, కొంక్యాస మురళీధర్ పాల్గొన్నారు.

జానపద నృత్య పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా యూనివర్సిటీ జోనల్ సెలక్షన్స్ సాంస్కృతిక విభాగంలో సంప్రదాయ, జానపద నృత్య పోటీలు శనివారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎ.వి.అనురాద, కె.పరిమిళ వ్యవహరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాలొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, కల్చరల్ కో-ఆర్డినేటర్ కె.ప్రతిష్ట, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, ఆర్.శ్రీనివాస్ పాత్రో, సిహెచ్.రామమూర్తి, చలమయ్య, చిరంజీవరావు పర్యవేక్షించారు.